క్లుప్తంగా

భ్రమరాంబాదేవికి ఊయలసేవ


అంకాళమ్మకు విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7గంటలకు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజల అనంతరం అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైలగ్రామ దేవతగా పిలవబడుతున్న అంకాళమ్మ వారికి విశేషపూజలు నిర్వహించారు.

ప్రతి రైతు శాశ్వత భూహక్కు పొందాలి

పాములపాడు: భూమి ఉన్న ప్రతి రైతు తన పొలానికి సంబంధించి శాశ్వత భూ హక్కు పొందాలనేది ప్రభుత్వ ఉద్దేశమని తహసీల్దార్ రత్నరాధిక అన్నారు. శుక్రవారం మండలంలోని తుమ్మలూరు గ్రామంలో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు రీ సర్వే పూర్తయినందున గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సర్వేపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని రైతులకు సూచించారు. త్వరలో పత్రాలు పంపిణీ చేస్తామన్నారు. సభలో సర్పంచు వరప్రసాద్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, వీఆర్వో పుల్లారెడ్డి పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో మెరుగైన వైద్య సేవలు


వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ వినోద్‌కుమార్

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో గ్రామాల్లో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం వీరాపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి బీపీ, షుగర్, టీబీ, దగ్గు, జ్వరం, కీళ్లనొప్పులకు పరీక్షలు నిర్వహించారు. 47 మంది బీపీ, 54 మంది షుగర్, ఆరుగురు టీబీ వ్యాధిగ్రస్తులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ దేవకరుణమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ రవికుమార్, హెల్త్ అసిస్టెంట్ శ్రీరాములు నాయక్, ఏఎన్‌ఎం సరిత పాల్గొన్నారు.

18న మండల సమావేశం

పగిడ్యాల: ఈనెల 18న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు తమ శాఖ ప్రగతి నివేదికలను 14వ తేదీలోగా నాలుగు సెట్లు జిరాక్స్ కాపీలను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం


విద్యార్థినికి మాత్రలు మింగిస్తున్న వైద్యుడు సుబ్రమణ్యం

నందికొట్కూరు రూరల్: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పీహెచ్‌సీ వైద్యుడు సుబ్రమణ్యం సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులి పురుగుల వల్ల తలెత్తే అనారోగ్య సమస్యల నుంచి పిల్లలను రక్షించేందుకు ప్రభుత్వం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తుందన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం


బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: బాల్య వివాహాలను అరికడదామని ఐసీడీఎస్ నందికొట్కూరు ఏసీడీపీఓ మంగవల్లి, ఎంపీడీఓ మేరీ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల తల్లీ బిడ్డలకు అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే 112, 181, 100 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగేశ్వరమ్మ, అంజలి, అంగన్‌వాడీ టీచర్లు రవణమ్మ, మరియమ్మ, శేసమ్మ, విజయమ్మ, నాగమణి, సునీత, లైసెమ్ పాల్గొన్నారు.

ఇక రయ్..రయ్!

నందికొట్కూరు మండలంలో రహదారులు మెరిసిపోతున్నాయి. ఏళ్లుగా గతుకుల రోడ్లతో ఇబ్బంది పడిన వాహనదారులు ఇప్పుడు రయ్..రయ్ మంటూ దూసుకెళ్తున్నారు. ఒకప్పుడు ప్రయాణమంటేనే నరకప్రాయంగా భావించే పల్లె ప్రజలు ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేకుండానే సాఫీగా రాకపోకలు సాగిస్తున్నారు.

- మెరిసిపోతున్న గ్రామీణ రహదారులు
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు



నాడు అల్లూరు-శాతనకోట రోడ్డు



నేడు అల్లూరు-శాతనకోట రోడ్డు

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు నుంచి వడ్డెమానుకు వెళ్లే రోడ్డు, అల్లూరు నుంచి శాతనకోటకు వెళ్లే రోడు కొన్నేళ్లుగా గుంతలమయంగా ఉండేవి.రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి లో భాగంగా స్థానిక ప్రజల కోరిక మేరకు నియోజకవర్గ ఎమ్మెల్యే ఆర్థర్, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిల సహకారంతో ఆయా గ్రామాల ప్రజల కలను నెర వేర్చాలన్న సంకల్పంతో ఇటీవల రూ.2.65 కోట్లతో బీటీ రోడ్లు వేయించారు. ఇన్నేళ్లకుతమ గ్రామాల రోడ్లకు మహర్దశ పట్టిందని ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇన్నాళ్లకెన్నాళ్లకు..

అల్లూరు నుంచి శాతనకోటకు వెళ్లే రోడ్డు సుమారు 4 కిలోమీటర్లు ఉంటుంది. రోడ్డు మొత్తం రాళ్లు తేలి, గుంతలు పడి అధ్వానంగా ఉంది. ప్రయాణం చేయాలంటేనే నరకం కనపడేది. సమస్యను గత ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో అలాగే కాలం వెళ్లదీస్తూ వచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సమస్యను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు నిధులు మంజూరు చేయించి ఇటీవల తారు రోడ్డు వేయించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్లుగా ఇబ్బంది పడ్డాం



ఎన్నో ఏళ్ల నుంచి అల్లూరు-శాతనకోట రోడ్డు గురించి ఎవరూ పట్టించుకోలేదు. గుంతలు, గులకరాళ్లు తేలిపోవడంతో ద్విచక్ర వాహనంలో వెళ్లాలంటే భయంగా ఉండేది. వర్షాకాలం అయితే సమస్య మరింత తీవ్రంగా ఉండేది. గుంతల్లో వర్షపు నీరుతుండటంతో వాహనాలు ప్రమాదాలకు గురయ్యేవి. ఇన్నేళ్ల తరువాత తారురోడ్డు వేయడం సంతోషంగా ఉంది.

– జక్కం మురళీ, శానతకోట గ్రామస్తుడు

జగనన్నకు రుణపడి ఉంటాం



గతంలో ఎన్ని ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా రోడ్డు గురించి పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్డుకు మోక్షం వచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మా ఊరి ప్రజలు రుణపడి ఉంటాం.

– జనార్దన్‌గౌడు, శాతనకోట సర్పంచ్

సమరయోధులను స్మరించుకుందాం


శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి

మిడుతూరు: స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరులను స్మరించుకుందామని ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల సమాఖ్య కార్యాలయ ఆవరణంలో నా మట్టి – నా దేశం కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరుల జ్ఞాపక శిలాఫలకాలను ఏర్పాటుచేసి కొబ్బరి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి భావి తరాలకు అందించి పుడమి తల్లిని కాపాడుకుందామని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనాథ్, ఏపీఓ జయంతి, ఏపీఎం సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల పరిశీలన పూర్తి

పగిడ్యాల: స్థానిక పంచాయతీలో ఏర్పడిన 9వ వార్డు సభ్యుని ఉప ఎన్నిక కోసం నమోదైన నామినేషన్ల పరిశీలన కార్యక్రమం శుక్రవారం ముగిసింది. వార్డు సభ్యుడి ఎన్నిక కోసం నాలుగు నామినేషన్లు నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుభాన్ తెలిపారు. నాలుగు నామినేషన్లు నిబంధనల ప్రకారం ఉండటంతో నోటీస్‌బోర్డులో అభ్యర్థుల జాబితాను ప్రదర్శించామన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


జైకిసాన్ పార్కులో మొక్కలను నాటిన మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరిపై బాధ్యత ఉందని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో ఆజాది కా అమృత్ మహోత్సవం నిర్వహించారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన వారిని స్మరించుకోవాల్సిన అవసరముందన్నారు. అనంతరం సంతపేట స్కూల్‌లో నా భూమి–నా దేశం నేల తల్లికి నమస్కారం వీరులకు వందనం కార్యక్రమంలో పాల్గొన్ని పైలాన్‌ని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. మాజీ సైనికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, ఎంఈఓ ఫైజున్నీసాబేగం, మేనేజర్ మంజునాథ్‌గౌడ్, కౌన్సిలర్లు లాలుప్రసాద్, హమీద్, చాంద్‌బాషా, నాయబ్, రవూఫ్, వైఎస్సార్‌సీపీ నాయకులు బ్రహ్మయ్య, రమేష్, శాలిబాషా, పి.రమేష్, శ్రీను, ఆర్ట్ శ్రీను, రజినీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ


చెక్కును అందజేస్తున్న ఆర్టీసీ డీఎం మహేంద్రుడు

ఆత్మకూరు: బస్సు సర్వీసులు బాగా నడిపి సంస్థకు ఆదాయాన్ని తెచ్చిపెట్టిన ఉద్యోగులకు డిపో గ్యారేజ్ ఆవరణలో శుక్రవారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ ఏర్పాటు చేశారు. జూలైలో అత్యధిక డీజిల్ పొదుపు చేసిన డ్రైవర్లు ఏఎం బాషా, బీఎస్ మహమ్మద్‌కు, అత్యధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లు రామలింగారెడ్డి, ఎస్ఎండీ హుస్సేన్, జీసీ నాగమ్మ, రవిశేఖర్, రూపవాణిలకు ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసా పత్రాలు డిపో మేనేజర్ మహేంద్రుడు అందజేశారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ



మహానంది: కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి దంపతులకు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు శుక్రవారం రాత్రి పల్లకీసేవను నిర్వహించారు.

బాధితులకు న్యాయం జరిగేలా చూస్తాం


బాధితులతో ఎంపీ, ఎమ్మెల్యేలు

జూపాడుబంగ్లా: శ్రీశైలం డ్యాం నీటి ముంపు బాధితులకు జీఓ 98 ప్రకారం త్వరలో ఉద్యోగ అవకాశాలు లభించేలా చూస్తామని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు తొగురు ఆర్థర్, శిల్పా చక్రపాణిరెడ్డి, తెలిపారు. శుక్రవారం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి నీటి విడుదలకు వచ్చిన ఎంపీ, ఎమ్మెల్యేలను నీటిముంపు బాధితులు కలిసి తమ సమస్యను విన్నవించారు. ఈసందర్భంగా ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు ఆర్థర్, శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ 98 జీఓ ప్రకారం 674 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని అసెంబ్లీలో ప్రస్తావించడంతో పాటు విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మరోమారు సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నీటిముంపు బాధితుల సంఘం నాయకులు నారాయణరెడ్డి, శీను, లక్ష్మీనారాయణ, శంకర్, రాజారావు,నారాయణ,దర్గయ్యతదితరులు పాల్గొన్నారు.

మోదీని గద్దె దించాలి

నందికొట్కూరు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీని గద్దె దించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆర్భాటాలు తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. కేంద్ర మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరముందన్నారు. సమావేశంలో నాయకులు మజీద్, రఘురామమూర్తి, రమేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పొలం విషయంలో ఘర్షణ

నందికొట్కూరు: మండల పరిధిలోని మల్యాల గ్రామంలో పొలం విషయమై దాయాదుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పుల్లయ్యపై దాయాదులు సింహాద్రి, అశోక్, మహేష్, పద్మావతి దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు టౌన్ సీఐ విజయభాస్కర్ తెలిపారు.

సృజనాత్మకతను వెలికి తీయాలి


ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఈఓ ఫైజున్నీసాబేగం

నందికొట్కూరు: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని ఎంఈఓ ఫైజున్నీసాబేగం ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్ కార్యక్రమం నిర్వహించారు. బ్యాంక్‌ల్లో దొంగలు పడితే సైరన్ మోగే యంత్రం, అంధులకు ఎదురుగా వచ్చే వాహనం తెలియజేసే కర్ర పరికరం, షాపింగ్ మాల్‌లో బాత్‌రూంలోకి వెళ్లేటప్పుడు లైట్లు వెలగడం, బయటకు వచ్చే సమయంలో లైట్లు ఆరిపోవడం తదితర ప్రాజెక్ట్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

విద్యుత్ కోతలు నిరసిస్తూ ధర్నా


గాజులపల్లెలో రోడ్డుపై ధర్నా చేస్తున్న గ్రామస్తులు

మహానంది: అప్రకటిత విద్యుత్ కోతలపై ప్రజలు ఆగ్రహించారు. గాజులపల్లెలోని పెట్రోల్ బంకు వద్ద ధర్నాకు దిగారు. శుక్రవారం రాత్రి 7 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సుమారు రెండు గంటల పాటు కరెంట్ లేకపోవడంతో ఆగ్రహించిన గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గాజులపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. కాగా గ్రామస్తుల ధర్నాతో నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులో వందలాది సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి.

అట్టహాసంగా 'నా భూమి నాదేశం'

శ్రీశైలంప్రాజెక్ట్: భూమి నాదేశం కార్యక్రమాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్.పి. హుస్సేన్‌బాషా ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.నిర్మల, ఎం .పద్మ, ఎస్.మహేశ్వరరెడ్డి, ఎస్ఎస్.శర్మ, ఎస్‌కె. షాహిదా, జీవైవి.కళ్యాణి, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో, గువ్వలకుంట్ల గ్రామంలో నా మట్టి–నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కలు నాటించారు. గువ్వలకుంట్లలో శివగంగాధర్ ఆర్మీ జవాన్, నాగేషారెడ్డి సీఆర్పీఎఫ్ జవాన్, పోలీసు కానిస్టేబుల్ గద్ద భాస్కర్ ఆయా శాఖల్లో చేసిన సేవలను ఎంపీడీఓ మేరి కొనియాడారు.

పగిడ్యాల: నా మట్టి– నాదేశం కార్యక్రమాన్ని ఎం.ఘణపురం, పడమర ప్రాతకోట పంచాయతీలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మండల ఉపాధ్యక్షురాలు బోరెల్లి శ్యామలమ్మ, నందికొట్కూరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు హాజరై దేశం కోసం ప్రాణాలర్పించిన వారికి ఘన నివాళులర్పించారు. గ్రామ సచివాలయం, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటి మట్టిని సేకరించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, ఏపీఓ మద్దిలేటి పాల్గొన్నారు.

చంద్రబాబు మాలల ద్రోహి


మాలవీరులకు నివాళులర్పిస్తున్న మాలమహానాడు నాయకులు

నందికొట్కూరు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా శాంతి యుతంగా నిరసన తెలుపుతున్న మాలలనూ 1997 ఆగస్టు 11న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చరిత్రలో మాలల ద్రోహిగా మిగిలిపోతారని మాలమహానాడు నియోజకవర్గ అధ్యక్షులు నగేష్ విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటంలో మరణించిన శేషయ్య, నారాయణ చిత్రపటాలకు శుక్రవారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో ఆయన నివాళులర్పించారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు డాక్టర్ రాజు, మనోహర్, జాను శేఖర్, దానమయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల కళ్లల్లో ఆనందం చూడటమే ధ్యేయం

- ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు, శిల్పా చక్రపాణిరెడ్డి, తొగురు ఆర్థర్, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి
- బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి నీరు విడుదల


నీటి విడుదల అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు తొగురు ఆర్థర్, శిల్పా చక్రపాణిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి

పాములపాడు: ప్రతి రైతు కళ్లల్లో ఆనందం చూడాలనేది తమ ధ్యేయమని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు తొగురు ఆర్థర్, శిల్పా చక్రపాణిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ వెంకటరమణతో వారు మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరు నుంచి 4 గేట్ల ద్వారా 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని, బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు ద్వారా తెలుగుగంగ(వీబీఆర్), కేసీసీ ఎస్కేప్ చానల్‌కు 6 వేల క్యూసెక్కుల చొప్పున 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని చెప్పారు. వారం రోజుల పాటు ఇలాగే కొనసాగుతుందన్నారు. నీటి విడదల వల్ల రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. వారి వెంట డీఈ హరినాథ్‌బాబు, జేఈలు దేవేంద్ర, విశ్వనాథ్, మధుసూదన్‌రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, చెలిమిల్ల సర్పంచు కోట్ల చంద్రారెడ్డి, కో ఆప్టెడ్ ముర్తుజావలి, పీఎంసీ చైర్మన్ మాలిక్, నాయకులు శివలింగం, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు నీళ్లిస్తాం

నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు నీరందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. శుక్రవారం లింగాల ఎత్తిపోతల పథకం నుంచి 2 మోటార్ల ద్వారా 72 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల పథకాల నుంచి కేసీ కెనాల్‌కు నీటి విడుదల చేసేందుకు అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే నీటిని విడుదల చేస్తారన్నారు. ఎమ్మెల్యే వెంట డీఈ నాగార్జునరావు, ఏఈఈ నారాయణరెడ్డి, టీపీ సాంబశివుడు, ఎత్తిపోతల పథకం చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాలీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటిని వృథా చేయొద్దు


జూపాడుబంగ్లా ఎత్తిపోతల పథకాన్ని స్విచ్ ఆన్ చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

జూపాడుబంగ్లా: రైతులు సాగు నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన తాటిపాడు గ్రామంలోని జూపాడుబంగ్లా ఎత్తిపోతల పథకం స్విచ్ ఆన్ చేసి ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేశారు.అనంతరం కృష్ణమ్మకు వాయనం సమర్పించారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జూపాడుబంగ్లా ఎత్తిపోతల పథకం ద్వారా 80 బన్నూరు, తంగడంచ, పారుమంచాల గ్రామాల్లోని 4,089 ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. మొదట బోర్లు, బావుల్లేని రైతుల పొలాలకు నీరు పారించుకునే వెసులుబాటు కల్పించాలని అధికారులు, కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు కరుణాకర్‌రెడ్డి, జంగాల పెద్దన్న, దేవసహాయం, శివానందరెడ్డి, ఉస్మాన్‌బాషా, రమేష్‌గౌడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దిలీప్‌రాజు, ఎంపీటీసీ కృపాకర్ పాల్గొన్నారు.

జీవాల పెంపకం లాభదాయకం

జూపాడుబంగ్లా: జీవాల పెంపకం లాభదాయకమని రాష్ట్ర గొర్రెల పెంపకందారుల శిక్షణాకేంద్రం ఏడీ ఎం.శ్రీనివాసులు, జూపాడుబంగ్లా ఏడీ రామాంజనేయనాయక్ తెలిపారు. శుక్రవారం వైకేపీ కార్యాలయంలో జీవాల పెంపకంపై రైతులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం కింద 100 జీవాలు, ఐదు పొట్టేళ్లకు రూ.20 లక్షల రుణం కేంద్రప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. అందులో రూ.10 లక్షలు సబ్సిడీ వర్తిస్తుందన్నారు. ఇలా 400 జీవాలకు రూ.కోటి వరకు రుణసౌకర్యం బ్యాంకుల్లో ఇస్తున్నట్లు తెలిపారు. కిసాన్ క్రెడిట్‌కార్డు కింద రూ.లక్ష నుంచి రూ.2.50 లక్షల వరకు రుణం మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రాయితీలను సద్వినియోగం చేసుకొని జీవాలపెంపకం చేపట్టాలని రైతులకు సూచించారు. అనంతరం జీవాల్లో వ్యాపించే వ్యాధులు, నివారణ మార్గాలను తెలియజేశారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు మంజూరు చేయటంతో పాటు ఈనెల 16న యాగంటి శిక్షణా కేంద్రం వద్దకు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువుల వైద్యులు ఎస్.ప్రశాంతి, శ్రీనివాసులు, జానకి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలు ఆరోగ్యానికి మేలు


చిరుధాన్యాలపై విద్యార్థులకు వివరిస్తున్న ఏడీఏ ఆంజనేయ

పాములపాడు: చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ తెలిపారు. శుక్రవారం జాతీయ చిరుధాన్యాల దినోత్సవం సందర్భంగా ఏఎన్ఆర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కొర్రలు, రాగులు, సజ్జలు, జొన్నలు, సాములు, వరగెలు, ఊదలు ఆహారంలో భాగంగా తీసుకోవాలన్నారు. ఇవి ఐరన్, జింక్, పాస్ఫరస్, ప్రొటీన్స్, ఖనిజాలు అధిక మోతాదులో ఉండి అధిక శక్తిని ఇస్తాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటసుబ్బమ్మ, పశు వైద్యాధికారి భాస్కర్, మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి, ఏఈఓ మద్దిలేట పాల్గొన్నారు.

లాభసాటి వ్యవసాయం చేయాలి

ప్రతి రైతు అధిక దిగుబడులు సాధించేలా లాభసాటి వ్యవసాయం చేయాలని ఏడీఏ ఆంజనేయ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ మినుము పీయూ31 రకం అందుబాటులో ఉందని, కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో పేరు నమోదు చేయించుకోవాలని తెలిపారు. రైతులకు సూక్ష్మ పోషకాలైన జింక్, జిప్సం, బోరాన్, రాయితీలో అందించాలని, ఆర్బీకేల్లో డీఏపీ, యూరియా కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంచాలని సలహా మండలి సభ్యులు కోరారు.